

కథ 2003

12

# అలజడి

కొట్రగడ్డ దయానంద్

జిల్లాను తూర్పు పడమరలుగా కలిపే పెద్ద రహదారి పక్కన ఊరు, ఊరు దాటాకా చుట్టూ ప్రహరీగోడలతో, గోడల్లోపల అనంతంగా భూమిని తవ్వి తీసిన పెద్దపెద్ద బావుల లోయలు, బావికి దక్షిణంగా విస్తృతంగా పరచుకున్న మట్టిగుట్టలు, ఉత్తరంగా కదలకుండా పడున్న పెద్దపెద్ద నల్లటి గ్రానైట్ రాళ్లు.

ఏభైమంది మనుషులు కూడా కలిసి కదిలించ లేని ఆ రాళ్లను అటూ ఇటూ ఇనుపచేత్తో ఉక్కు బలంతో కదిలిస్తూ రాక్షసయంత్రంలా ప్రొక్లెయినర్, అది దొర్లించుకుంటూ వచ్చిన రాళ్లను ఇనుపతీగెల మధ్య బిగించి పట్టుకుని అమాంతం పైకి లేపి నిదానంగా లారీల్లో కూర్చోబెడుతున్న మరో రాక్షస యంత్రం.

హఠాత్తుగా సుడులు తిరుగుతూ ఒక తెల్లటి దుమ్ము అల లేచింది. నడుముకు తాడు చుట్టి రాళ్లను డ్రిల్లింగ్ చేస్తున్న నలుగురు మనుషులు పైకి లేచిన తెల్లటి గాలి అల విసురుకు రాళ్ల పొడి కళ్లల్లో పడి పని ఆపి కళ్లు నలుముకుంటున్నారు. యంత్రరాక్షసి గొప్ప ఉత్సాహంతో పెద్ద రొదతో గిర్రున తిరుగుతోంది. అడ్డ మొచ్చిన చిన్నచిన్న రాళ్లను ఇనుపచేత్తో అవలీలగా ఎత్తి దారికి దూరంగా పెడుతూ, కావల్సిన పెద్దపెద్ద రాళ్లను ఏనుగుతొండంలా చాచి దొర్లించుకుంటూ తీసుకొచ్చి ఇనుపతీగెలకు అందిస్తోంది. లారీలలోకి రాళ్లను లోడింగ్ చెయ్యడం మొదలుపెట్టి నాలుగైదు గంట లైంది. ప్రొక్లెయినర్ గిర్రున తిరిగే తీరు, నిర్లక్ష్యంగా చిన్న చిన్న రాళ్లను ఎత్తి అవతల పడేస్తున్న ఒడుపూ, అలవి మాలిన రాళ్లను ఊపుగా నెట్టుకుంటూ విసురుగా విసుగ్గా కదిలిస్తోన్న వేగం ఆఫీసు కిటికీలోంచి గమ నిస్తున్న గుమాస్తాను కలవరపరిచింది.

అనుమానమేదో తోచి హడావుడిగా బయటికొచ్చి చూశాడు. ప్రొక్లెయినర్‌లో కూర్చొని నడుపుతున్న నారాయణ అసహనంగా తలకు చుట్టుకున్న గుడ్డను విప్పి విదిలించి మళ్లీ కట్టుకున్నాడు. ఎడమచేత్తో గేరు మార్చి సునాయాసంగా బండిని నడుపుతున్నాడు. బండికి కాస్త దూరంగా పెద్ద రాళ్లను ఇనుపతీగెలకు తగిలిస్తున్న అయిదారుగురు కూలీలు, కాస్త అవతలగా డ్రిల్లింగ్ చేస్తున్న పది పన్నెండు మంది కూలీలు, ఇంకాస్త ఎడంగా బీడీలు తాగుతూ జరిగే పనిని గమనిస్తూ లోడింగ్ కోసం వచ్చిన లారీల డ్రైవర్లూ, క్లీనర్లూ - అంతా పాతిక ముప్ఫయిమంది ప్రొక్లెయినర్ చుట్టూ ఎవరి పనుల్లో వాళ్లున్నారు.

గబగబా ప్రొక్లెయినర్ దగ్గరగా వచ్చి నిలబడ్డాడు గుమాస్తా. గట్టిగా ఏదో అరిచాడు. యంత్రం రొదలో నారాయణకేమీ వినబడలేదు. బండిని ఆపి ఏమి టన్నటు సైగ చేశాడు. టీకి వెడదాం రమ్మని చేత్తో సైగలు చేశాడు గుమాస్తా. నారాయణ బండి ఇంజన్‌ని ఆపి కిందకు ఒక్క దూకు దూకి గుమాస్తా చెంతకు చేరాడు. డ్రిల్లింగ్ చేస్తున్న అరవకూలీలు సైతం కాస్సేపు పని ఆపి మెల్లిగా ఊపిరి పీల్చుకున్నారు. ఒక గొప్ప ప్రశాంత వాతావరణం అక్కడంతా అలుముకుంది.

గుమాస్తా చిరునవ్వు ముఖంతో నారాయణను చూచి, గొప్ప ఉపద్రవం ఆపినవాడిలా నవ్వి, "మధ్యానం నుండి చూస్తన్నా! ఎందుకంత టెన్షన్‌గా ఉన్నావ్? రెడ్డిగారి సెల్‌కు ఫోన్ చేసేడు మేనేజర్. పినాకినిలో ఉన్నాడంట. ఎనిమిది తొమ్మిదికల్లా వచ్చేస్తాడు. పొద్దున్నే ఆయన బండిలోనే ఒంగోలు వెళ్లి ప్యాసింజర్ పట్టుకొని పోవచ్చుగదా! పనిలో అంత

చిరాగ్గా ఉంటేఎట్ట?'' అని చివరిమాటతో నారాయణకు చురకేసి, మెయిన్ గేటు దాటి తారురోడ్డు మీదికొచ్చేరు.

రోడ్డు మీద రెండుమూడు పోలీసు జీపులు పశ్చిమాన్నుంచి తూర్పువైపుకి హడావుడిగా ఆఘ మేఘాల మీద పరుగెత్తాయి. అవి లేపిన తెల్లటి దుమ్ము వాటి వెనకే చాలాదూరం వెంబడించింది. ఆ రోడ్డు పొడుగునా పాతిక కిలోమీటర్ల లోపులో గ్రానైట్ బావులు విస్తరించాయి. ఖాళీగా ఉన్న భూముల్లో కర్రతుమ్మ చెట్లు దట్టంగా విస్తరించి భూమిలో లేని తడికోసం ఆశగా ఆకాశాన్ని చూస్తున్నాయి. అక్కడక్కడా కాస్త కొండల కవతలగా తెల్లటి మాయమబ్బులు కమ్ముకుని అస్తమిస్తున్న సూర్యున్ని వెక్కిరిస్తున్నాయి.

వాళ్లిద్దరూ రోడ్డు వెంబడి కాస్త దూరం నడిచి రోడ్డు దాటి అవతలి పక్కనున్న గుడిసెలోకి దూరి చెరొక బల్ల మీద ఎదురెదురుగా కూర్చున్నారు. గనుల్లో పనికొచ్చిన నలుగురాడవాళ్లు గుడిసె బయట నిలబడి తూర్పువైపు వెళ్లే కంకర టిప్పర్లను ఆపుతున్నారు. గుమాస్తా తనకు అందుబాటులో ఉన్న పొడుగాటి గొట్టాలున్న చిప్స్ ప్యాకెట్‌ను అందుకొని ప్లాస్టిక్ కవర్‌ను పళ్లతో కొరికి, చింపి నారాయణకు కాసినిచ్చి తను తినడం మొదలుపెట్టాడు.

నారాయణ కరకరమని నములుతూ, "టెన్షన్ గాక ఏముందన్నా? ఎంత చాకిరీ చేసి ఏంలాభం? ఉత్తర మొచ్చి ఇయ్యాల్టికి మూడురోజులు. నాయన ఆరోగ్యం బాగాలేదని! ఆయన మొదలే టీబీ పేషంటు. ఇంటి కాడేమో మగదిక్కు లేని సంసారమాయె. మా యక్క ఒంటిచేత్తో ఎంతకని సముదాయిచ్చుద్ది. వచ్చిన జీతం ఖర్చులకే సరిపోకపోయె. జీతం అడ్వాన్సియ్యమంటే రెడ్డిగారు రావాలనె మేనేజరు. దానిగ్గూడా రెడ్డిగారు రావాల్నా? ఏ రోజుకారోజు బావుల్లో మందుపెట్టి పేలుస్తానే ఉంటిరి. సరుకు తీస్తానే ఉంటిరి. లోడింగ్ మెద్రాసు పంపిస్తానే ఉంటిరి. రెడ్డిగారు లేకపోయినా పన్లేమన్నా ఆగుతున్నాయా?'' గుమాస్తాకు మాత్రమే వినబడేట్లు చెప్పేడు నారాయణ.

"అట్టనుకుంటే ఎట్ట. ఎట్టనోకట్ట సర్దుకుపోవాల గాని. ఏదీ లేకనేగా ఈడకొచ్చి పడుంటున్నాం. నువ్వేం దిగులుపడబాకు. మీ నానకేం గాదులే. పరధ్యానంగా బండి నడపబాక. లేనిపోయింది... జీవితాంతం కుమిలి పోవాల. ఎంతమంది అరవకూలోల్లు మీ టిప్పర్ల క్రింద, మిషన్ల క్రింద, గ్రానైట్ల క్రింద దిక్కుమాలిన చావు చచ్చారో! మనుషులకు మనుషులు మాయమవడమే గాని, శవాలు దొరికితే కేసులనీ, డబ్బులనీ ఎంత మందిని కనబడకుండా చేసేరో ఈడ,'' చిన్నగా అన్నాడు గుమాస్తా.

"అప్పటికీ ఇద్దరు ముగ్గురు తెల్సినవాళ్లను అప్పడిగి చూసేనన్నా, ఎవురూ ఇయ్యకపోతిరి. ఊరుగాని ఊళ్లోకొచ్చి పడితిమి. ఏదన్నా నగో వస్తువో కుదవ బెట్టుకుని, నమ్మి ఇచ్చేవాళ్లేగానీ ఏమీలేకుండా మన కెవరు అప్పిస్తారు చెప్పు,'' నారాయణ అన్నాడు.

"ఈ గెనుల్లో పన్లకొచ్చే వాళ్ల బతుకులన్నీ ఇంతేగా. ఏడేడ నుంచో వస్తిమి. ఓనర్ల దయాదాక్షిణ్యంతో బతకాల్సిందేగా. మనకిక్కడ తెల్సినోడెవ్వడు? నమ్మి డబ్బిచ్చేవాడెవడు?'' గుమాస్తా అన్నాడు.

నారాయణ మెల్లిగా తలూపి టీ తాగి పైకి లేచాడు. చెరొక సిగరెట్టు వెలిగించుకుని దమ్ము గట్టిగా లాగి రోడ్డు మీదికొచ్చారు. ఈసారి పెద్దపెద్ద సైరన్‌లు మోగించుకుంటూ ఎర్రలైట్లు వెలుగుతూ ఆరుతూ ఒక కారు, రెండు పోలీసు జీపులు, ఒక వ్యాను పశ్చిమాన్నుంచి తూర్పువైపుకు అతి వేగంతో వెళ్లిపోయినై.

"అన్నా! చూస్తుంటే ఏడనో ఏదో జరిగినట్టుందే!'' అన్నాడు నారాయణ.

"జరక్క ఏముంది. ఎక్కడ చూసినా కరువే. మింగడానికి ముద్ద లేకపోయె. తాగెతందుకు నీళ్లు దొరక్కపాయె. మనిషి జన్మ ఎత్తినాక ఏ దారి మంచిదని తోస్తే ఆ దార్లో పోవాలిగదా! రాత్రి గవర్నమెంట్ గోడౌన్ల మీదకు పోయి బియ్యం, పప్పులూ, ఉప్పులూ ఏది చిక్కితే అది దోచుకుపోయారంట జనం. అందుకే ఈ హడావుడి,'' అన్నాడు గుమాస్తా.

మాట్లాడుకుంటూనే గుమాస్తా ఆఫీసు గదిలోకి, నారాయణ ప్రొక్లెయినర్ దగ్గరకు వెళ్లేరు. అప్పటిదాకా లోడింగ్ చేసి విశ్రాంతిగా కూర్చుని బీడీలు తాగుతున్న క్రేన్ ఆపరేటర్లు, కూలీలు గబగబా లేచి నిలబడి ప్రొక్లెయినర్‌కు ఎడంగా జరిగారు. నారాయణ ఎగిరి బండి మీదెక్కి కూర్చొని ఇంజన్ స్టార్ట్ చేశాడు. కొద్దికొద్దిగా చీకట్లు ముసురుకోవడంతో ఫ్లడ్‌లైట్లు వేశాడు. జిగేల్మన్న కళ్లతో కుడి అరచేతిని చూచుకొని పెదాలకానించుకొని చిన్న శబ్దం చేసి బండిని ముందుకు కదిలించాడు. కరకరమంటున్న ఇనుపకాళ్లతో కొండచిలువలా ముందుకు కదుల్తోంది ప్రొక్లయినర్.

నారాయణ తన లోకంలో తానున్నాడు. ఆలోచనలు ఎలా ఉన్నా కళ్లు, కాళ్లు, చేతులూ వాటి పని అవి చేసుకునే పోతున్నాయి. ఎంత బరువునైనా అలవోకగా నెట్టుకుపోతోంది మిషన్. గుమాస్తా మాటలు గుర్తొచ్చాయి. ఎంతమందిని ఈ బావులూ, మెషిన్లూ మింగేసినాయోననుకున్నాడు. బావ శ్రీనివాసులు గుర్తొచ్చాడు. అతడి బలవంతం మీదనే తాను లారీడ్రైవర్‌గా వెళ్లడం మానుకుని ప్రొక్లయినర్ నడపడం నేర్చు

కున్నాడు. అతడితోపాటూ తనూ ఈ గెని జీవితంలోకి వచ్చాడు. పదేళ్లు ఇక్కడే ఈ గెనిలోనే చేసేడు బావ. ఓపన్‌కాస్ట్ మైను, మందు మిస్‌బ్లాస్టు అయి ఒక్క దెబ్బకు నలుగురు మనుషులు తునాతునకలయ్యారు. మైకా మైన్‌లో మేట్‌గా పనిచేస్తూ ఎక్కువ జీతానికాశపడి రెడ్డిగారి ప్రోద్బలంతో గ్రానైట్ గనిలోకి వచ్చిన బావ- ఇక్కడే ఈ మట్టిగుట్టల్లోనే అంతమయ్యాడు. తునా తునకలైన దేహం, ఛిద్రమై గుర్తుపట్ట వీలుకాని అవయవాలు- మూటగట్టిన మాంసం ముద్దలూ, ఒక పాతికవేలు కాంపన్సేషనూ దక్కేయి అక్కడ భూ దేవమ్మకి. ఈ పది పదిహేనేళ్లలో ఈ చుట్టుపక్కల ఎంత మందిని గ్రానైట్ బతుకులు మింగేయో! 'తన బతు క్కుడా ఇక్కడే తెల్లారిపోవలసిందేనా!' ఉలిక్కిపడ్డాడు నారాయణ. పరధ్యానంలోంచి ఈ లోకంలోకి వచ్చేడు. కింద నుంచి కూలోల్లు పెద్దపెద్దగా అరుస్తున్నారు. కుడి పక్క ఉక్కు గొలుసుల కాళ్లకు పెద్ద బండరాయి అడ్డంగా ఉంది. బండి ముందుకు కదలనని మొరాయి స్తోంది. ఇక లాభంలేదని ఇంజన్ ఆపేసేడు. జేబులో నుంచి బీడి తీసి ముట్టించాడు.

ఒక దమ్ము గట్టిగా లాగి కూలీల మధ్య నిలబడి పళ్లు కొరుకుతున్న ఓనరు రవీంద్రారెడ్డిని చూచి ఒక్క క్షణం ఉలిక్కిపడ్డాడు నారాయణ. గభాల్న తేరుకొని కిందికి దిగేడు.

"మందుకొట్టి బండి తోల్తున్నావా ఏందిరా లమ్డీకే. ఎనకాముందూ చూచుకోకుండా, కళ్లేమైనా దె...నాయా," పళ్లు పటపటలాడించేడు.

"లేదయ్యా! ఏదో ధ్యాసలో పడి..."

"పన్లోకి దిగినాక ఇంకో ధ్యాసేందిరా? ఏ లంజ ముండ గుర్తొచ్చిందేం! మీ జీవాలకు ఎవుడన్నా చస్తే వేలకు వేలు నేనేడదెంకొచ్చి పొయ్యాల్రా? సంపాది చ్చిందంతా మీ ఎదాల్న పొయ్యడానికి సరిపోతంది! ఇట్లా చేస్తే ఇంకో ఆపరేటర్ని చూచుకోవాల్సిందే," రవీంద్రారెడ్డి అంటున్నాడు.

రవీంద్రారెడ్డిది గూడూరుకు తూర్పునున్న పల్లెటూరు. అటు మెడ్రాసు నుంచి ఇటు చీమకుర్తి దాకా ఆయనకు లేని వ్యాపారం లేదు. తండ్రి నుంచి సంక్రమించిన మైకాగనులు కాక, తన హయాంలో సంపాదించిన రొయ్యల చెరువులూ, ఇటు గ్రానైట్ గనులూ అన్నీ వ్యాపారాలు తనే స్వయంగా చూసు కుంటాడు. వాళ్ల మైకా గనుల్లోనే తండ్రి జీవితాంతం పనిచేశాడు. మళ్లీ నారాయణ కూడా వాళ్ల గనుల్లోనే కుదురుకున్నాడు.

రవీంద్రారెడ్డి మాటలకు నారాయణ మారు మాట్లాడలేదు. ఆయన తిడుతూనే ఉన్నాడు. ఆయన వెనకే ఆఫీసు గదిలోకి వెళ్లాడు నారాయణ తిడుతుంది తనని కాదన్నట్టుగా.

*

భార్యా కూతురుతో తొమ్మిదిగంటలకల్లా ప్యాసింజరు దిగేడు నారాయణ. గూడూరులో బండి దిగి పొదలకూరు బస్సెక్కారు. దారి పొడుగునా ఒకటే ఆలో చనలు... తండ్రికెలా ఉందోనన్న ఆందోళన. మనసంతా గజిబిజిగా ఉంది, అలజడిగా ఉంది.

గడియారస్థంభం సెంటరంతా నిర్మానుష్యంగా ఉంది. అప్పుడప్పుడొచ్చే ఒక్కో ఎర్రబస్సు, ఒక్కో ప్రైవేటు బస్సు తప్ప మరో సందడి లేదు. బస్సులు కూడా వెలితిగానే తిరుగుతున్నాయి. నిమ్మకాయల మార్కెట్లో కూడా సందడి సప్పుడు లేదు. ఈ రోజుల్లో ఎప్పుడూ వచ్చే లారీలు, పోయే లారీలు, కూలీల గోలతో సందడి గా ఉండే మార్కెటంతా నిశ్శబ్దంగా ఉంది. వానల్లేక, బావుల్లో నీళ్లు లేక కాపులేని నిమ్మచెట్లు నారాయణ కళ్ల ముందు కదిలేయి.

బస్సు గూడూరు దాటింది. దారి పొడవునా నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలాలు దిగాలుగా వున్నాయి. పొలాల్లో సైతం నరసంచారమే లేదు. బాగా వెన్ను మీదికొచ్చి ఎండిపోయిన పైరు ఒక్క తడి తగిలితే చాలన్నట్లు కడు దీనంగా ఉంది. మేతకోసం వచ్చిన బాతుల మందలన్నీ తార్రోడ్డు మీద నిరాశగా దిశా గమనం లేనట్లు సాగిపోతున్నాయి. బస్సు పడమరకు చొచ్చుకుపోయేకొద్దీ వాతావరణంలో సెగ మరింత పెరుగుతోంది. ఏ కాలంలోనైనా పచ్చగా, చల్లగా మిల మిలలాడే తిప్పారప్పాడు తోటలు సైతం వెచ్చని ఆవిర్లు వెదజల్లుతున్నాయి. వంతెన దాటి సైదాపురం చేరేసరికి చమటతో తడిసిపోయాడు నారాయణ. భూమిలో తేమ లేక మనుషుల ఒంట్లోని చెమ్మనంతా గాలి పీల్చేస్తోంది. ఒళ్లంతా కుతకుత ఉడికిపోతూ లోపలి వేడంతా పెదాల మధ్యలోంచి ముక్కుల్లోంచి బయటకొస్తోంది. బస్సు ఆగగానే నీళ్ల ప్యాకెట్టు కొని భార్యకూ, పిల్లకూ చెరొకటి ఇచ్చి తనోటి తాగేడు. దప్పిక తీరక ఇంకోటి కూడా కొని గుటగుట తాగి స్థిమితపడ్డాడు నారాయణ. ఊటు కూరులో ఎవరిదో తెల్సిన మొహం కనపడింది. పలక రిద్దామనుకుంటే నోరు పెగల్లేదు. అంతలోనే బస్సు కదిలింది. గొంతులో పలకరింపు గొంతులోనే ఆగింది.

బస్సు కండలేరు చప్టా దాటింది. నది ఎడారిలా ఉంది. నది దాటి పైకెక్కగానే రోడ్డుకు రెండుపక్కలా

కర్ర తుమ్మచెట్ల బీళ్లు స్వాగతం పలికేయి. బీళ్లు దాట గానే ఒక్కో మైకా గని వచ్చినప్పుడల్లా మిలమిల మెరిసే పనికిరాని మైకా బిళ్లలతో ఆకాశం వైపు చూస్తున్న మట్టి గుట్టల మధ్య నుంచి క్రేన్ల తలలు అప్పుడప్పుడూ రోడ్డు మీదకు తొంగి చూస్తున్నాయి. నాలుగైదు మైకా గనుల గుట్టలు దాటాక బస్సాగింది. బస్సు దిగి నేరుగా ఇంటికి నడుస్తూంటే దార్లో ఒక ముసలామె వాళ్లను పలకరిం చింది. భార్య ఏదో సమాధానం చెప్పింది.

ఒంటి నిట్రాడు ఇల్లు. చూరు దించిన పంచ, ఏ కాలంనాడో కప్పిన తాటాకులు వానకు తడిచి ఎండకు ఎండి నల్లగా కాటుక పట్టి ఉన్నాయి. ఇంటి బయట కళ్లాపు జల్లి చక్కగా ముగ్గువేసి ఉంది. పది పన్నెండు తెల్లటి కోళ్లు బయట ఎండకు నోళ్లు తెరచి గొంతులు కదుపుతూ ఒక మూలనున్న జల్లెడ అరలో నిలబడి కునుకుపాట్లు పడుతున్నాయి.

పంచలో మరోపక్క నులకమంచం, మంచమ్మీద ఏనాటిదో చిల్లులు పడిన దుప్పటి, దానిమీద జీవచ్ఛ వంలా చొక్కా కూడా లేకుండా ఒక శరీరం...

నారాయణ మంచమ్మీదికి వొంగేడు.

తన తండ్రి మాలకొండయ్యేనా? అనుమానంగా చూచేడు నారాయణ.

తెల్లగా పెరిగిన గడ్డం, తెగ పెరిగిన జుత్తు, లోపలికి పీక్కుపోయిన కళ్లు...

నారాయణకు దుఃఖం పొంగుకొచ్చింది. బిగ బట్టుకున్నాడు. ''నా నా'' అంటూ పలకరించాడు. గొంతు పూడుకుపోయింది. మాలకొండయ్యలో కొద్దిగా కదలిక వచ్చింది. నీరసంగా కళ్లు తెరచి చూచేడు. కొడుకును గుర్తుపట్టి కళ్లను మిలమిలలాడించేడు. మనవరాల్ని, ముని మనవరాల్ని ఆరాగా చూచేడు.

కళ్లలో మెరుపులు - ముఖంలో అలసట - ముని మనవరాలి చెయ్యి పట్టుకులాగి మంచమ్మీద కూర్చో బెట్టుకున్నాడు. బీరతీగెలా ఒడలిపోయి ఉన్న తండ్రి చెయ్యి పట్టుకుని, ''ఒంట్లో ఎట్టుందే నాయనా,'' అని పలకరించేడు నారాయణ.

కొడుకు ముఖంలోకి చూచి సన్నగా నవ్వి, ''బాగానే ఉందిరా!'' అన్నాడు. ఆ ఒక్కమాటతో పాటు ఖళ్లున దగ్గు తెర విరుచుకుపడింది. కళ్లెను గోడవైపు ఊసేడు. గోడ నిండా కళ్లె మరకలు మరకలుగా చీదర చీదరగా ఉంది. వాటిమీద ఈగలు ముసురు తున్నాయి. నారాయణకు తండ్రి పరిస్థితి అర్థమైంది. ఆర్నెల్లయింది తండ్రిని ఆఖరుసారి చూచి, ఇంతలోనే ఇంత మార్పా అనుకున్నాడు నారాయణ. ఎటునుంచి వచ్చేడో నారాయణ కొడుకు తల్లి చేతిలోని సంచి లాక్కుని లోపలంతా అటూ ఇటూ వెదికి తనక్కావల సిందేదో తీసుకొని చెల్లెలు జడలాగి మళ్లీ పరిగెత్తి ఎటో మాయమైపోయాడు.

ఎప్పుడో యాభై ఏళ్ల కిందట మంచి వయస్సులో ఉన్నప్పుడు భార్య మాలక్షుమ్మను తీసుకొని ఆ ఊరొచ్చేడు మాలకొండయ్య. రెడ్డిగారి మైకాగనిలో పగలంతా పనిచేసి రాత్రిళ్లు సీసాలకొద్దీ సారా తాగి బజార్లో వీరంగం వేసేవాడు. గెనిలో కూలీలకు ఏదన్నా అన్యాయం జరిగితే సహించేవాడు కాదు. ఒకసారి దొంగ వేలిముద్రలు వేసి ప్రావిడెంటు ఫండ్ కాజేసిన గుమాస్తాని రాత్రిపూట పట్టుకొని పుడిసెడు నెత్తురు కక్కుకునేటట్లు కొట్టి వాడి అంతు చూచేడు. ఫ్యాక్టరీ లలోకి పనికెళ్లే ఆడపిల్లల్ని పాడుచేసిన ఓనర్ల పిల్లల్ని ముసుగేసి మరీ కొట్టేవాడు. దొంగలెక్కలు రాసి కూలో ల్లకు, డబ్బులెగ్గొట్టే ఓనర్ల గెనుల్లోంచి సరుకు బయటకు చేరేసి దొంగబజార్లో అమ్మి తలా కాసిని డబ్బు పంచే వాడు. మాలకొండయ్య చుట్టూ ఎప్పుడూ కూలోల్లు గుంపులు గుంపులుగా తిరిగేవారు. అన్యాయం చేసే వాడిని ముందు హెచ్చరించేవాడు. వినకపోతే తర్వాత తగిన శాస్తి చెప్పి చేసేవాడు. గనిలో చేరిన సంవత్సరానికే మాలకొండయ్య పేరు కాస్తా పైల్వాను కొండయ్యగా గని ప్రాంతమంతా మ్రోగిపోయింది. అట్లా సంవత్సరాల తరబడి మైకాగనిలో పనిచేస్తూ మైకా నీళ్లు త్రాగి, మైకా చూర పీల్చి, మైకా మట్టిలో పొర్లి ఆఖరుకు క్షయవ్యాధికి లొంగిపోయేడు మాలకొండయ్య. అప్పుడుగాని మైకా ఓనర్లు, వాళ్ల ఏజెంట్లు ఊపిరి పీల్చుకోగలిగేరు.

ఇంతలో భూదేవమ్మను తీసుకొని నారాయణ కొడుకు వచ్చేడు. ''ఇప్పుడేనంటయ్యా రావడం!'' అంటూ బయట లేవదీసి ఉన్న మంచం వాల్చి బొడ్డులో దోపు కున్న చీర నడిభాగాన్ని కిందకు లాక్కుని కూర్చుంది.

''అవునక్కా! ఏంది నాన్న ఇట్టా అయ్యేడు,'' నారాయణ గొంతు వణికింది.

భూదేమ్మ సాలోచనగా వాకిట్లో కింద కూర్చున్న కూతురివైపు, మనవరాలివైపు చూచి,

''ఏం చేద్దాంరా! మూడ్నెల్లయింది టీబీ హాస్పిటల్ మూసేసి. అక్కడున్నన్నాళ్లు నాయన బాగానే ఉన్నాడు. జబ్బు కూడ నయమైందనుకున్నాం. వేళకు మందులూ, తిండితిప్పలూ, బాగానే చూచేరు. ఆసుపత్రి మూసేసి రోగులందర్నీ ఇళ్లకు పంపించేరు. డాక్టర్లకీ, నర్సులకీ, మందులకీ మాకులకీ గవర్నమెంటు కాడ డబ్బుల్లే

వంట. ఇంటికొచ్చిన దగ్గర్నుంచీ మందులు సరిగ్గా మింగడు. తిండి అమిరికా సరిగ్గా లేదు. ఇంక మనిషి ఎట్టుంటాడు చెప్పు, రోగం తిరగబెట్టింది," అంది.

"మందులు గెట్టిగా మింగించాల్సిందక్కా! ఈ రోగం రోజుక్కొంచెం కొంచెం చంపే రోగమక్కా!" అన్నాడు నారాయణ తండ్రి గుండెలవైపు చూస్తూ.

"అప్పటికీ బయట కొనుక్కొస్తూనే ఉన్నారా మందులు. చేతికిచ్చి వేసుకోమంటే వేసుకుంటాలే ఆడ పెట్టు అంటాడు. గదిమి గట్టిగా మాట్లాడితే చేతిలోకి తీసుకుంటాడు. వేసుకుంటాడు గదా అనుకుంటా! తీరా చూస్తే మందులన్నీ దిండుకింద దాచి పెడతన్నాడు. ఏందీ పని అంటే మాట్లాడడు. అరిస్తే కళ్లు మూసుకుంటాడు. ఏం చెయ్యాలో నాకే అర్థం కావడంలా."

"లేదు లేమా! అమ్మమ్మ పోయిన కాడి నుంచి తాత అదోలాగయ్యేడు. ఆమె పోవడమే ఆయనకు మైండు పోయినట్లుంది" కూతురు కల్పించుకుని భూదేవమ్మతో అంది.

"ఆమెకేం మహాతల్లి కడుపునొప్పి కడుపునొప్పంటూ వంక పెట్టుకుని ప్రాణం కడతేర్చుకుని పోయింది. ఈయన్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. నువ్వు చెబితేనన్నా వింటాడేమోనని నీకు కబురు చేసేన్రా" అని "పిల్ల ఎట్ట చదువుతుందే" అని కూతుర్నడిగింది భూదేవమ్మ.

"ఏం చదువుల్లే! చదువు చారెడు బలపాలు దోసెడని ఫీజులు మాత్రం పిండుతున్నారు. నెల నెలా ముద్దర్సుద్దిగా డబ్బులు కట్టలేక చస్తున్నాం! జీతం డబ్బులు చాలక మరీ అగచాట్ల మారి బతుగ్గా ఉందే!" అంది.

"పిల్లదానికే అట్టుంటే ఎట్టనే! ఇయ్యేడు తాలితే వీడ్ని కూడా ఆడికే తీసుకెళ్లి బడిలో ఎయ్యాల. ఈ సంవత్సరమే ఆకరంట. ముందు నాటికి హైస్కూలు కూడా మూతేస్తున్నారంట" అంది భూదేవమ్మ.

"అదేందక్కా! హైస్కూలు మూతేయడమేంది?" కంగారుగా అడిగేడు నారాయణ.

"పొయ్యేకాలంరా పొయ్యేకాలం. మూడ్నెల్లనాడు టీబీ ఆసుపత్రి మూసేసినారా! నెల క్రితం అంత పెద్ద కాన్పుల ఆసుపత్రిని మూసేసి వచ్చినోళ్లని చేర్చుకో కుండా చూచి పంపడానికి ఒక డాక్టర్నీ, నర్సునీ అట్టి పెట్టారు. నాల్గురోజులాగితే వాళ్లిద్దర్ని కూడా పంపేస్తా రంట. ఈ పరీక్షలైపోగానే బడి కూడా మూతేస్తారంట. ఇప్పట్నుంచే ఎవుళ్ల దారివాళ్లు వెదుక్కుంటున్నారు.

నారాయణకేమీ అర్థంకాలేదు. భూదేవమ్మ కూడా అతనికి అర్థం అయ్యేటట్లు చెప్పలేక పోయింది. ఎటూ దిక్కూదరీ తోచని స్థితిలో ఉన్నాడు. కాసేపు తండ్రి పక్కన మాటలు రానివాడిలా కూర్చున్నాడు. బయట పొయ్యి మీద వంట చేస్తున్న అక్కను, ఆమె పక్కనే కూర్చుని విషాదంగా మంటవైపు చూస్తున్న భార్యను ఆరాగా చూచి,

"నాయన్ని ఒకమాలి డాక్టరు దగ్గరకు తీసుకెడ దామక్కా!" అన్నాడు.

"ఆయనేమంటాడో అడిగి చూడు."

"ఆయనదేముందిలే! రిక్షా తీసుకొస్తా. నువ్వు కానియ్యి," అని బయటకు నడిచి రిక్షా చిన్నోడిని పిలుచుకొచ్చాడు. తండ్రి గింజుకుంటున్నా బలవంతం గా రెక్కపట్టి పైకి లేపి నుంచోబెట్టి పంచె గట్టిగా చుట్టి అక్కా, తమ్ముడిద్దరూ కల్సి చెరోవైపున పట్టుకుని బల్ల రిక్షాలో కూర్చోబెట్టారు. ఆయన కూర్చోలేక అటూ ఇటూ ఒరుగుతుంటే మెల్లిగా పడుకోబెట్టేరు.

రిక్షా హాస్పిటల్ చేరేసరికి నర్సు ఒక్కతే ఉంది. డాక్టరు మైన్సు మెస్సుకి భోజనానికెళ్లేడు. ఎప్పుడూ నలుగురు డాక్టర్లతో, ఇరవై పాతికమంది నర్సులు, ఆయాలు, సిబ్బందితో మంచాలనిండా రోగులతో నిండి ఉండే ఆసుపత్రిలో ఒకే ఒక్క నర్సు దిగులుగా బిక్కు బిక్కుమంటూ కూర్చోనుండటం నారాయణను కదిలించివేసింది. ఆసుపత్రిని శుభ్రం చేసేవాళ్లు కూడా లేనట్టుంది. ఎక్కడ చూసినా దుమ్మూ, డాక్టర్ తాగి పారేసిన సిగరెట్ పీకలు, ఎటూ ఎగరలేక ఒకమూలకు చేరిన ప్లాస్టిక్ కవర్ల సంచులూ, పై కప్పు నిండా బూజు, అంతా అసహ్యంగా ఉంది. ఆసుపత్రి చుట్టూ విపరీ తంగా పెరిగిన జపాన్ తుమ్మచెట్ల కొమ్మలు తెరిచిన కిటికీల్లోంచి తలుపు సందుల్లోంచి లోపలకు ప్రవేశించ డానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. తండ్రిని బల్లమీద పడుకోబెట్టి అక్కను తోడుగా ఉంచి బయటకు నడిచేడు నారాయణ.

ముఖద్వారం దగ్గరకు వచ్చేడు. పెద్ద ఆర్చితో కట్టిన ఇనుపగేటు తుప్పు పట్టి ఒకప్రక్క విరిగి పోయి ఉంది. ప్రయాణీకుల కోసం కట్టిన బస్సు షెల్టరు ఒక వైపు నుంచి కూలుతూ మెల్లిమెల్లిగా భూమ్మీదికి జారు తోంది. నీలంరంగు వేసిన పెద్ద బోర్డు మీద "కార్మిక మంత్రిత్వ శాఖ - భారత ప్రభుత్వము, మైకా మైన్ లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్' అని రాసిన అక్షరాలు నిన్నగాక మొన్ననే రాసినట్టు మెరుస్తున్నాయి. బోర్డు మాత్రం

చెక్కు చెదరక అలాగే నిలబడి ఉంది. 'క్షయ ఆసుపత్రికి దారి' బోర్డు వైపు చూసి అటు నడిచేడు నారాయణ. వెళ్లేకొద్దీ కంపతుమ్మ చెట్ల కొమ్మలతో నిండిపోయింది. ఏమాత్రం అడుగు అజాగ్రత్తగా వేసినా పచ్చి లేత ముల్లు గూడా చర్మాన్ని చీరేసే ట్లుంది. కష్టపడి ఎంతో జాగ్రత్తగా నడిచి క్షయ ఆసుపత్రి ముందుకు చేరేడు నారాయణ. మెయిన్‌గేటుకి ఎద్ద తాళం కప్ప వేలాడుతోంది. కటకటాల్లోంచి లోపలకు తొంగి చూచేడు. అంతటా గబ్బిలాలు స్వైర విహారం చేస్తున్నాయి. లోపల్నుంచి ఒక విధమైన మకురు వాసన నారాయణను చుట్టుకుంది. ఆసుపత్రి మూడు నెల్లనాడు మూసినట్టుగా అనిపించలేదు నారాయణకు. ఎన్నో ఏళ్ల క్రిందట మూసేసిన మాంత్రికుడి గుహలా అనిపించిందతనికి. ఆసుపత్రి ముందు గచ్చుతో కట్టిన అరుగు మధ్యలో ఉన్న పచ్చటి నేరేడు చెట్టు మాత్రం గుబురు ఆకుల కొమ్మలతో పిట్టలకు గూడైంది.

తండ్రిని కల్సుకోవడానికి అనేకసార్లు అక్కడికి వచ్చేడు నారాయణ. డాక్టర్ల చిరునవ్వులు, నర్సుల అదిలింపులు, బయట ఎండ పొదకు ముడుక్కుని కూర్చుని ఖళ్లు ఖళ్లుమని దగ్గే రోగులు అన్నీ కళ్ల ముందు కదిలేయి. కాస్త అవతలగా ఉన్న వంటగదిలో రోగుల కోసం వండే వంట తాలింపు వాసనా మదిలో కొచ్చేయి. ఆ చెట్టు కింద అరుగుమీద తనూ, తండ్రి ఎన్నోసార్లు కలుసుకుని కూర్చుని మాట్లాడుకోవడం గుర్తొచ్చింది. ఎప్పుడూ అక్కడే ఉండి చికిత్స చేయించుకునే రోగులూ, వాళ్ల కోసం వచ్చిన బంధువులూ... ఆ చెట్టు మొదలంతా సందడి సందడిగా ఉండేది. అంతా గుర్తొచ్చి తల గిర్రున తిరిగింది నారాయణకు. చెట్టు మీంచి పిట్ట ఒకటి అదే పనిగా కూస్తోంది. అది బాధో, దుఃఖమో తెలీని కూతలాగా అనిపించింది అతనికి.

దిగులుగా అక్కడ్నుంచి కదిలి చెట్ల కడ్డంబడి నడుస్తూ హైస్కూలు వైపు నడిచేడు. దార్లో టీచర్లూ, డాక్టర్లూ, నర్సులూ, గుమాస్తాలూ ఉండే ఇళ్లన్నీ వెలవెలబోతున్నాయి. ఏ ఇంట్లోనూ మనుషులు కాపురముంటున్న సందడే లేదు. ఎక్కడో ఒకటో అరో ఇల్లు తప్పించి అన్నిటికీ తాళాలేసి ఉన్నాయి. ఆ ఇళ్ల పెరడుల్లో మాత్రం విరగబూసిన పూతతో నిండిన మామిడిచెట్లు, మునగచెట్లూ, విపరీతంగా కాపు కట్టిన బూరుగచెట్లు ఎప్పటికైనా మనుషులొచ్చి ఇక్కడ కాపురాలు ఉండకపోతారా అన్న ఆశతో ఆకాశాన్ని చూస్తున్నాయి.

ఆదివారం కావటాన స్కూలు మూసి ఉంది. బయట గోడకున్న నల్లటి పెద్ద బోర్డు మీద 'ప్రయత్నించు సాధించు' అన్న అక్షరాలు పెయింట్ చేసి ఉన్నాయి. ఆ బోర్డు మీద ఏ రోజు వార్తలు ఆరోజు చూచి పొద్దున్నే విద్యార్థులు రాస్తారు. తను వార్తలు రాసిన రోజులు గుర్తొచ్చి నారాయణ బోర్డు దగ్గరకెళ్లి నిలబడ్డాడు. బోర్డు మీద ముద్దగా గుండ్రంగా రాసిన చెరిగిపోయిన అక్షరాల్తో ఉన్న వార్తల్ని కూడబలుక్కుని చదివేడు నారాయణ.

''ప్రైవేటుపరం చేయవద్దంటూ సింగరేణి కార్మికుల సమ్మె''

''వేగతరమవుతున్న రెండో విడత ఆర్థిక సంస్కరణలు''

''నాలుగేళ్ల పాటు ప్రతి సంవత్సరం అయిదు శాతం కేంద్ర సిబ్బంది కుదింపు''

'బహుశా ఇంకో రెండు మూడు నెలల తర్వాత ఇవి రాయడానిగ్గూడా ఇక్కడ మరెవ్వరూ ఉండరేమో,' అనుకున్నాడు నారాయణ. ముందుకు కదిలి ఒకటో తరగతి గది నుంచి మూడో తరగతి గది దాకా తలాపున పెద్ద మానుతో భూమ్మీదికి వంగి ఉండాల్సిన గంగిరేగు చెట్టు కోసం గాలించేడు నారాయణ. మొదుల్లో పెద్ద తొర్రబడి, పురుగు తొలిచి చెట్టంతా పచ్చగా ఉన్నప్పుడే రెండుగా చీలి మొదలుదాకా విరిగిపోయిన జాడ చూడగానే ఎన్నో ఆటలు గుర్తొచ్చాయి నారాయణకు. ప్రక్కన ఏదో సన్నగా జారుతున్న సవ్వడి- పెద్ద జెర్రిపోతొకటి దాదాపు ఏడెనిమిదడుగులు పొడవుంది, చరచరా దూకుతూ అతడి పక్కనుంచి వెళ్లిపోయింది. దూరాన్నుంచి ఎవరో వస్తూ కనిపించేరు. దగ్గరకొచ్చేక చూస్తే డ్రిల్లు పంతులు రవిప్రకాష్. ఇద్దరూ బాల్య స్నేహితులు. హైస్కూలు వరకు అక్కడే చదువుకున్నారు. కరచాలనం చేసుకున్నారు.

''నాయనకు బాగులేదంటగా! చీమకుర్తి నుంచి ఎప్పుడొచ్చేవ్?'' అడిగేడు ప్రకాష్.

''అవున్రా! ఆసుపత్రికి తీసుకొచ్చేను. డాక్టర్ భోజనానికెళ్లేడంటే ఎవరన్నా కలుస్తారేమోనని ఇటొచ్చా!'' అన్నాడు నారాయణ.

ఇద్దరూ మాట్లాడుకుంటూ నడుస్తూ వెళ్లి ముందున్న జెండా అరుగు మీద కూర్చున్నారు.

నారాయణ మాటకు నవ్వేడు ప్రకాష్.

''ఇంకేం ఆసుపత్రులూ, డాక్టర్లూ నారాయణా! బయటెక్కడికన్నా తీసుకెళ్లి చూపించు, ఇక్కడ లాభం లేదు. మందులు కూడా ఇవ్వటంలా,'' అన్నాడు ప్రకాష్.

మెల్లిగా ఇద్దరూ మాటల్లోకి దిగేరు. నారాయణ తన అనుమానాలన్నీ అడిగేడు. ప్రకాష్ చెప్పేడు.

ఏడాది క్రితం ఢిల్లీ నుంచి నలుగురధికార్లు వచ్చేరు. ఆఫీసులో లెక్కలు చూచేరు. మైకా గనుల నుంచి రిజిస్టర్లు తెప్పించేరు. పేరుకు పాతికా ముప్పై గనులున్నా ఎవరూ పైసా సెస్ కట్టడంలేదంట. గనుల్లో పని జరుగుతున్నట్లూ, సరుకు తీస్తున్నట్లూ రికార్డులే లేవంట. గనిలో వందమంది పనిచేస్తే పదిమంది మాత్రమే పనిచేస్తున్నట్లు చూపిస్తున్నారంట. కొన్ని గనులైతే పూర్తిగా మూతవేసినట్లే రికార్డుల్లో ఉందట. నిజానికి గనులన్నిట్లో పని ఎప్పటిలాగే జరుగుతూనే ఉంది. సరుకు పైకి తెస్తానే ఉన్నారు. తెచ్చిన సరుకును పకడ్బందీగా ఫ్యాక్టరీలకు తరలించి గ్రేడ్ చేయించి, సైజు చేసి బ్లాకు మార్కెట్ ద్వారా అమ్ముకుంటున్నారు. వచ్చిన అధికార్లేమో కార్మికుల లెక్కలు వేసేరు. గనుల్లో కార్మికులే లేకుండా ఆసుపత్రులకు రోగులూ, బడికి పిల్లలు ఎక్కడి నుంచి వస్తున్నారని అడిగేరు. అంతా బోగస్ పేర్లన్నారు. దొంగ రోగులన్నారు. గనులే పని చెయ్యనప్పుడు ఆసుపత్రులెందుకు, స్కూళ్లెందుకంటూ రిపోర్టిచ్చారంట! ఇప్పుడేమో ఒక్కొక్కటే ఎత్తేస్తున్నారు.

"అయితే మనోళ్లు గమ్మునుండారా! ఏం చెయ్యలేదా?" అడిగాడు నారాయణ.

"మునపటి రోజులు గాదు నారాయణ. పియ్యఫ్‌లు, పెన్షన్లూ ఇవ్వాల్సి వస్తుందని గనిలోకి పోయే వాళ్ల నిజం పేర్లు రికార్డుల్లో ఉండనే ఉండవు. ఏ రోజు కూలీకి ఆరోజు వెళ్లడం, డబ్బు తెచ్చుకోవడం, అట్లా అలవాటు చేసేరు జనాన్ని. ఇష్టమైతే పన్లోకిరా, లేకపోతే లేదు అంటున్నారు మేనేజర్లు. అప్పటికీ అందరం కల్సి అర్జీలు రాయించేం. అధికార్లకు పంపించేం. అయినా లాభం లేకపోయింది. డాక్టర్లనీ, నర్సుల్నీ, ఆయాల్నీ తమిళనాడుకీ, కేరళకీ, దేశంలో ఎక్కడ ఖాళీలు ఉంటే అక్కడికి బదిలీలు చేశారు. ముసలీ ముతకా ఉన్నారంటూ, పిల్లల చదువులంటూ రిలీవ్ కాకుండా ఆగిన వాళ్లను రిలీవ్ చేసి వెళితే వెళ్లండి లేకపోతే వాలంటరీగా రిటైరై వెళ్లిపొమ్మంటున్నారు. ఏం చేసినా ఇది ఆగేదికాదు. ఇదంతా ఒక్కరోజులో వచ్చిందని నేననుకోవడంలేదు. ఒకపక్కన గనులోళ్లు చేస్తున్న మోసానికి తోడు ప్రభుత్వం కూడా సిబ్బందిని తగ్గించాలనీ, ఆదాయం లేని శాఖల్ని మూసేయ్యాలని తీసుకున్న నిర్ణయం అంటున్నారు కొందరు," ప్రకాష్ ఒక్కోమాట నిదానంగా పలుకుతున్నాడు.

"మరి స్కూలు సంగతో," విషాదంగా అడిగేడు నారాయణ.

"ఇదీ అంతే! స్టేట్ గవర్నమెంటుని కలుపుకోమని రాసేరు. వాళ్లు గూడా మాకెందుకీ గుదిబండ అన్నారంట. స్కూలు ఎత్తేసి మమ్మల్ని జడ్పీలకు అప్పజెబుతారంటున్నారు. ఇప్పుడు చదివే పిల్లల గతి ఏం కావాల్నో అంతా అయోమయం."

దూరాన్నుంచి స్కూటర్ మీద డాక్టర్ ఆసుపత్రి వైపు వెళ్లడం చూసి అటువైపు నడిచేరు ఇద్దరూ. డాక్టర్ మాలకొండయ్యను చూచి, మందులు లేవంటూ బయట కొనుక్కోమని చీటి రాసిచ్చేడు. "టీబీ కదా! మందులు సరిగ్గా వాడటంలేదులాగుంది. రెండోసారి తిరగబెట్టడం... బాగా ముదిరింది. మందులు ఖచ్చితంగా వాడాలి. ఒంటికిపట్టే తిండి కూడా పెట్టాలి," వస్తుంటే చెప్పేడు డాక్టరు. సరేనంటూ డాక్టరు దగ్గర రవిప్రకాష్ దగ్గరా వీడ్కోలు తీసుకుని రిక్షా వెనుకే ఊరివైపు నడిచేడు నారాయణ.

మధ్యానం ఆసుపత్రి నుంచి వచ్చాక గబగబా రెండు ముద్దలు తిని మందులు తెస్తానంటూ నెల్లూరెళ్లి ఏడుగంటల బస్సుకి ఊళ్లో దిగేడు నారాయణ. అప్పటికే ఊర్ని చీకటి ముసిరింది. కరంటు లోఓల్టేజీతో వీధిలైట్లు మసగ్గా వెలుగుతున్నాయి. అప్పుడే ఇంటి కెళ్లాలనిపించలేదు నారాయణకు. అటూ, ఇటూ బస్టాండులోనే కాసేపు తిరిగాడు. కూల్డ్రింకు షాపుల దగ్గరా, యూసుఫ్ హోటల్ దగ్గరా, కోమట్ల కిరాణా కొట్టుల దగ్గరా ఎప్పుడు ఉండే సందడి లేదు. ఒకరో అరో మనుషులు అటూ ఇటూ ఏదో బరువును మోస్తున్నట్లు తిరుగుతున్నారు. వాళ్లల్లోనూ ముసలి వాళ్లు, పిల్లలూ, ఆడవాళ్లు మాత్రమే కనబడుతున్నారు. ఎవరికి వారు ఏమీ పట్టనట్లు ఇతరులతో సంబంధం లేనట్టు దిగులో విషాదమో మరేదో వాళ్లను సామూహికంగా అల్లుకుపోయినట్లు తిరుగుతున్నారు. స్నేహితులుకాని, తన ఈడువాళ్లుగాని కనిపిస్తారేమోనని చూచేడు. ఊళ్లో ఎవరూ లేనట్టుంది. బతుకుతెరువు కోసం అంతా ఊరు విడిచిపోయినట్టుగా అనిపించింది నారాయణకు. తెల్సినవాళ్లు ఎవరూ కనబడకపోయేసరికి బస్టాండుకు కాస్త దూరంగా బ్రాంది షాపు పక్కన పెట్టిన అక్క భూదేవమ్మ బండివైపు నడిచేడు. చెక్కబండి ముందు నుంచుని హడావుడిగా ఉంది భూదేవమ్మ. బాండీలో వేపుతున్న పకోడీని కలబెడుతూ వేయిస్తోంది. ఎవరన్నా వచ్చినప్పుడు హడావుడిగా పొట్లాలు గట్టి అమ్ముతోంది. ఆ మసక చీకట్లో కూడా తోలు వలిచి కారం, పసుపూ, రంగు పులిమి వేలాడగట్టిన రెండు

కోళ్ల శరీరాలు ఎర్రగా మెరుస్తున్నాయి. కాస్త అవతల ఉన్న బ్రాందీషాపులో మాత్రం కాస్త హడావుడిగా ఉంది. బండి పక్కనే వేసి ఉన్న బల్ల మీద ఇద్దరు ముదురు మనుషులు కాస్త చీకట్లోకి ముఖాలుండేట్లు కూర్చుని గ్లాసుల్లోది తాగుతూ కాగితం పొట్లంలో ఉన్న పకోడీని నంజుకుంటున్నారు. అప్పటికే బాగా తాగినట్టున్నారు. ఏదో విషయమ్మీద వాదన పెంచుకుంటున్నారు.

నారాయణని చూచి వాళ్లలో ఒకడు, "ఎవురీ మడిసి," అన్నాడు.

"మా తమ్ముడులేన్నా! నారాయణ. చీమకుర్తిలో ఉంటున్నాడు," అంది భూదేవమ్మ.

"అమ్మా భూదేవమ్మ తల్లీ! పైల్వాన్ మాల కొండయ్య కొడుకు నారాయణేనా! మీ నాయన నాగ్గురువు తల్లీ! గురువు," అని ఆగి తన సహచరుడి వైపు తిరిగి, "ఎట్టుండేవోడు ఎట్టయ్యేడో సూసేవంట్రా, కాలం. కాలం అట్టాగొచ్చింది. ఈ మైనోల్లను, ఈ గవుర్మెంటు ఉజ్జోగాల్చేసే వాళ్లను ఒకప్పుడు ఒకాట ఆడించేడు తెలుసా! ఒరే నాయనా, చిటికె చిటికేస్తే మేమంతా ఎమ్మటుండి దూకేవాళ్లం," అని నారాయణ వైపు తిరిగి, "మనిషిలో పొగరుంటేనే నాయనా, ఎవుడైనా మాటినేది, మాయన్నలో పొగురు తగ్గింది. దొమ్మ తగ్గింది. లేబరోల్లకు సత్తువ తగ్గింది. ఎవుడమ్మా ఇప్పుడు లేబర్ తరపున మాట్లాడే నా కొడుకు, ఒక్కడుంటే ఒక్కడ్ని చూపెట్టు. వాడి పియ్య తింటాం," అని గట గటా గ్లాసులోది తాగి తుపుక్కున ఉమ్మి ఊసేడు.

"ఒరే ఊకోరా! ఎవుడికేం పన్రా లేబరోడి పక్కన మాట్లాడను," అన్నాడు రెండోవాడు ముద్ద ముద్దగా.

"అదే మాలకొండన్న హయాంలోనైతేనా? ఆయన విగ్రహాన్ని చూచి ఉచ్చ కార్చుకునేవాళ్లు మైనోల్లు. అట్టాంటిది ఇప్పుడు లేబరంటే లెక్కుందా? కలుపుకో, కోతలకో పోయే రోజుకూలీల్ని చేస్తిరి గదరా మనల్ని. థూ... ఏం బతుకులైనైరా? ఓపికుంటే మైనుకు పోవడం, లేకుంటే కాళ్లు బార్లా జాపి పడుకోవడం. ఒక ప్రావిడెంటు పండు లేదంట, ఒక పెన్షన్ రాదంట. ఆసుపత్రుల్లేవంట. ఆఖరుకు బడులు గూడా మూసేస్తారంట. లమ్డికొడుకులు. ఒక్కడంటే ఒక్కడు కూడా మాట్లాడుత లేడు."

ఆ మాటలు వింటూ అట్లాగే బల్ల రెండో చివర వెలుతుర్లోకి కూర్చుని ఆలోచనల్లో పడ్డాడు నారాయణ. అతడికి హఠాత్తుగా చిన్నప్పటి సంగతి గుర్తుకొచ్చింది. పాతికేళ్లనాడు మైనులోకి దిగాలంటే కటిక చీకట్లోంచి ఒక మనిషి మాత్రమే దూరేంత కంతలో నుంచి కిందకు దిగి ఆ పైన తాళ్లతో చేసిన నిచ్చెన పట్టుకుని మైళ్లకు మైళ్లు వెడితేగాని పనిచేసే చోటురాదు. దారంతా వెల్తురుండాలనీ, సేఫ్టీ ల్యాంపు లియ్యాలనీ, జీతం పెంచాలనీ చిన్నదానికీ పెద్దదానికీ ఓనర్లతో పేచీలు పెట్టుకుంటున్నారు కార్మికులు. వాళ్లకు ముందుండి నడిపించేది మాలకొండయ్య. కార్మికుల మీద ఈగ వాలనిచ్చేవాడు కాదు. గనిలోకి దిగేడంటే ముగ్గురు మనుషుల పనిచేసేవాడు. ఓనర్లు కొండయ్యను పనిలో పెట్టుకోవాలంటే భయపడేవాళ్లు. పని ఎంత బాగా చేసినా ఎప్పుడన్నా బెడిసి కొట్టినప్పుడు సరుకును దొంగ దారుల్లో గనుల్లోంచి పైకి తెచ్చి అమ్మి అందరికీ పంచుతాడని భయపడేవాళ్లు.

గనిలో పనిచేసేటప్పుడు బ్లాస్టింగ్ జరిగి వొదులొదులుగా వున్న పై కప్పు కూలిపోయింది. లోపలున్న వాళ్లు లోపల్నే చిక్కుకుపోయారు. పైకి రావడానికి మార్గం మూసుకుపోయింది. ఊరంతా అల్లకల్లోలమైంది. ఓనర్లందరూ లోపల్లోపలే సంతోషించేరు. మైను ఓనర్లంతా కూడబలుక్కుని కావాలనే ఆ పని చేయించారని కార్మికుల్లో అలజడి పెరిగింది. కార్మికులంతా మైను దగ్గరకు చేరుకున్నారు. ఊటుకూరు, తలుపూరు ఇంకా మిగతా ఊర్లలోని మైన్లు కూడా మూసేశారు. ఫ్యాక్టరీల మీదకు రాళ్లు వేసేరు. ఓనర్లు భయపడి మెద్రాసు నుంచి ఇంజనీర్లను పిలిపించారు. ఏవేవో లెక్కలు వేసి గనిలోపలికి బయట నుంచి పైపులు దించేరు. పైపుల్లో నుంచి అన్నం పొట్లాలు, మంచినీళ్ల సీసాలు పంపించేరు. గొట్టాలకు నోరు అడ్డంపెట్టి అరిచేరు. చెవులానించి విన్నారు. లోపల్నించి కేకలు వినిపించాయి వాళ్లకు. లోపలున్న వాళ్లు మూడోరోజుక్కూడా బతికున్నారనే తేలింది. వాళ్ల నెట్టా తీసుకురావాలనేది ప్రశ్న అయింది. అనుభవమున్న కార్మికుడొకడు గొట్టాల్లో నుంచి అన్నం, నీళ్లు పంపించినట్టుగానే రెండు గెడ్డపారలు పంపమన్నాడు. అట్టాగే చేసేరు. అయిదురోజులు గడిచేయి. రోజులు గడిచేకొద్దీ వాళ్లు వస్తారన్న నమ్మకం సడలుతోంది. కార్మికుల్లో ఆవేశాలు రగుల్తున్నాయి. కార్మికులందరూ రాత్రింబగుళ్లు మైను దగ్గరే జాగారం చేసేరు. తిండీతిప్పలూ లేవు. కాగడాలు, నూనె దివిటీలు పట్టుకొని లోపలున్నవారు ఎటునుంచైనా రాకపోతారా అని రాత్రుళ్లు కూడా ఎదురుచూసేవారు. ఓనర్లని బయటికి రానియ్యలేదు. ఏం చెయ్యాలో అర్థంకాని స్థితి.

ఈలోగా కలక్టరు, ఆ దార్లో వెడుతున్నాడని తెల్సింది. కార్మికులంతా రోడ్డు మీదకు చేరేరు. కలక్టరు కారుని ఆపేరు. అయిదుగురు మనుషులు గనిలో చిక్కుకున్న విషయమంతా చెప్పేరు. ఎట్టాగైనా

మనుషుల్ని భూమిలోంచి తెచ్చే మార్గం చూడమన్నారు. నెల్లూరు వెళ్లి అన్ని విషయాలు చూస్తానన్నాడు కలక్టరు. 'ఎప్పుడో కాదు ఇప్పుడే ఏదో ఒకటి చెయ్యాలన్నారు' జనం. 'ఇప్పటికప్పుడు ఎట్టా కుదురిద్ది?' అన్నారు అధికారులు. 'మావాళ్ల ప్రాణాలు పోయాక చూస్తారా?' అని నిలదీశారు జనం. జనం రోడ్డు మీద అడ్డంగా పడుకున్నారు. తప్పుకోమన్నారు అధికారులు. వినలేదు జనం.

పోలీసులొచ్చేరు. లాఠీఛార్జి చేసేరు. రోడ్డంతా బీభత్సంగా అయింది. అందర్లోనూ కసి, కోపం, అలజడి, ఆక్రోశం... మగవాళ్లు వెనక్కి తగ్గేరు. పిల్లలూ, ఆడవాళ్లు ముందుకొచ్చి కలెక్టర్ కారు కదలకుండా రోడ్డు కడ్డంగా కూర్చున్నారు. పోలీసులు మళ్లీ లాఠీల్తో కొట్టేరు. హాహాకారాలు, ఏడుపులు చెలరేగాయి. అయినా రోడ్డు వదల్లేదు ఆడవాళ్లు. తుపాకులు పైకెత్తేరు పోలీసులు. కాల్చి వేస్తామన్నారు.

''ఏడరా! మీరు కాల్చేది?'' అంటూ మాల కొండయ్య భార్య మాలక్షుమ్మ బిగ్గరగా అరుస్తూ పైకి లేచింది.

''మా మొగుళ్లను మాకు తెచ్చియ్యమంటే మమ్మల్నే కాలుస్తారంట్రా! కాల్చండ్రా దొంగనా బట్టల్లారా! మా మనుషుల సంగతి తేల్చి చెప్పిందాకా మీరిక్కడ నుంచి కదల్డానికే లేదు,'' అంటూ అరిచింది ఆమె.

పోలీసులు మళ్లీ అరుస్తూ కాలుస్తామని బెదిరించేరు. ''ఒరే! మీరేగాని మొగోల్లయితే కాల్చండ్రా కాల్చండి,'' అంటూ మాలక్షుమ్మ మొలదాకా చీరను పైకెత్తి పట్టుకుంది. అక్కడున్న మిగతా ఆడవాళ్లు పిల్లలతో సహా ఒక్కుమ్మడిగా పై గుడ్డల్ని మొలదాకా లేపి, ''లంజకొడుకుల్లారా! కాల్చండ్రా ఎట్టా కాలుస్తారో మేముగూడా చూస్తాము,'' అంటూ బిగ్గరగా అరిచేరు. అదొక సామూహిక నిరసన. ముందు వరుసలోనున్న పోలీసులు దిమ్మెరపోయారు. వెనక కారులో కూర్చున్న కలెక్టరుకూ, జిల్లా అధికారులకూ మెదడు కూసాలు కదిలేయి. గుండెలు జారిపోయాయి. ఇక లాభం లేదని కారుని వెనక్కి తిప్పి మైను దగ్గరకు చేరేరు. జిల్లా యంత్రాంగంతో మంతనాలాడి అప్పటికప్పుడే భూమిని తవ్వి పొయ్యడానికి నెల్లూరు నుంచి పెద్దపెద్ద మిషన్లు తెప్పించేరు. ఎక్కడ్నుంచో ఫైరింజనూ వచ్చి వాలింది. వాళ్లను బయటకు తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

ఈ ప్రయత్నాలు ఇలా ఉండగానే పైనుంచి వెళ్లిన గెడ్డపారలతో భూమిని మూడురోజుల పాటు తొలిచి సొరంగమేసుకుని వాళ్లకు తెల్సిన నీళ్లొస్తాయని మూసేసిన దారితో కలుపుకుని వారంరోజుల తర్వాత వాళ్లంతటవాళ్లే బయట ప్రపంచంలో కొచ్చేరు వాళ్లయిదుగురు. ఆ వారంరోజులూ ఒక్క గనిలోనూ పని జరగలేదు. ఒక్క ఫ్యాక్టరీ గేటు కూడా తెరుచుకోలేదు. వాళ్లు బయటకు వచ్చేక మరో మూడురోజులు ఏ మైనూ పని చేయలేదు. ఒక సామూహిక పండగ వాతావరణం గని ప్రాంతాన్ని కమ్మేసింది.

ఆ విషయం గుర్తొచ్చి మనసంతా కకావికలమైంది నారాయణకు. అయిదుగురు ప్రాణాలు కోసం ఆరోజున జనమంతా వీధిలోకొచ్చి నిలబడ్డారు. అటువంటిది ఇవ్వాళేమైంది? ఎవరికీ ఏమీ పట్టనట్లుగా తిరుగుతున్నారు. ఏం చేసినా జరిగేది జరగక మానదన్నట్లుగా ఉంది వ్యవహారం. తాగి మాట్లాడడం తప్పితే గుండె విప్పి కష్టసుఖాలు చెప్పుకునేవాళ్లే కరువయ్యారు. చదువుకున్నవాళ్లూ, చదువులేనివాళ్లు అంతా అట్లాగే వున్నారు. ఈ నిర్లిప్తత, నిస్సత్తువ జనంలోకి ఎక్కడి నుంచొచ్చింది? ప్రకాష్ అన్నట్టు ఇదంతా ఒక్కరోజులో వచ్చిందేనా? నారాయణను ప్రశ్నలు తొలి చేస్తున్నాయి.

రోడ్డు మీద జనం బాగా పలచబడ్డారు. బ్రాందీ షాపులో హడావుడి పెరిగింది. చివరి బస్సు దిగిన ఏభై, అరవైమంది కూలోల్లు తెల్లారేసరికల్లా గనిలోకి దిగడానికి రోడ్డు పక్కన దుమ్ములో పక్కలు పరుచుకుంటున్నారు.

నారాయణ బల్లమీంచి లేచేడు. పిల్లిలా నడుస్తూ వెళ్లి బ్రాందీషాపులోకి దూరేడు. మళ్లీ వెంటనే బయటికొచ్చి భూదేవమ్మ బండి దగ్గరకొచ్చి ఇంటికెడుతున్నానని చెప్పేడు.

''నేను తొందరగా వస్తాలే,'' అంటూ ఆమె నారాయణ చేతికి రెండు పొట్లాలిచ్చింది. వాటిని తీసుకుని ఇంటికొచ్చేడు. పిల్లలిద్దరూ ఒక మంచమ్మీద పడుకుని నిద్రపోతున్నారు. భార్య ఒక మంచమ్మీద, తండ్రి మరో మంచమ్మీద పడుకున్నారు. ఇంట్లోకెళ్లి రెండు గ్లాసులు, చెంబు నిండా నీళ్లు పట్టుకొచ్చేడు. భార్య నిద్రమత్తులోనే అవతలకి జరిగి పడుకుంది. తండ్రి మంచమ్మీద కూర్చున్నాడు నారాయణ. ఒగడాకులా ఉన్న తండ్రి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఆ స్పర్శకి తండ్రిలో చిన్న వణుకు- లేచి కూర్చోబోయాడాయన. శరీరం సహకరించలేదు. చేతకాలేదాయనకు. తనే రెక్కలు పట్టుకుని లేపి స్థిమితంగా కూర్చోబెట్టాడు. కొనుక్కొచ్చిన మందుల్ని తండ్రి చేతుల్లో

పెట్టేడు. ఈసడింపుగా చూసేడాయన. ''మీకేం పనీ పాటా లేదుట్రా! ఒద్దంటే మందులు కొనుక్కొచ్చి ఇస్తన్నారు. మీ బతుకులు మీరు బతికితే చాలురా. కాలమైపోయినోడికి ఇంకా మందులెందుకురా!'' అంటూ నీరసంగా కోప్పడ్డాడు. అంతలోనే ఆయన్ను ఒక దగ్గుతెర ముంచేసింది.

''అట్టా కాదులే నాయనా! నీకోసం కాదులే. మాకోసమన్నా మింగు. నువ్వు లేకపోతే మేమేం గావాల చెప్పు'' తండ్రి గడ్డం పట్టుకొని బతిమిలాడేడు నారాయణ. మందులు తీసుకుని తల దగ్గర దుప్పటి కింద భద్రంగా దాచిపెట్టేడు.

జేబులో నుంచి సీసా తీసి సటుక్కున మూత తిప్పి గ్లాసులో పోసేడు. కాసిన్ని నీళ్ల కలిపి ప్రేమగా తండ్రి నోటికి అందించేడు నారాయణ. ఆ వాసనకే సంబరపడి రెండు గుక్కలు వేసేడు మాలకొండయ్య.

చానాళ్ల తర్వాత మెల్లిగా మాలకొండయ్యలో ఒక అపూర్వమైన చలనం మొదలైంది. సర్దుకుని నులక మంచంలో నిటారుగా వెన్ను చాచి కూర్చున్నాడు.

అతడి వళ్లంతా ఒక రకమైన ఉత్తేజం-

కొడుకు సాన్నిహిత్యం, ఎదురుగా కళ్లముందు నిద్రబోతూ కోడలైన కూతురి బిడ్డా, మానవ సంతానమూ-

హఠాత్తుగా భార్య మాలక్షుమ్మ గుర్తొచ్చిందతనికి. ఒక దిగులు మబ్బు అతడి ముఖాన్ని కప్పి వేసింది. తండ్రీ కొడుకులిద్దరూ ఒకర్నొకరు ఆనుకుని కూర్చు న్నారు. తాగుతూ, తింటూ ఎప్పటప్పటియో సంగతులు గుర్తు చేసుకున్నారు. గనిలోకి రాకముందు దొంగగా తిరిగిన రోజుల్నీ, తనను ఇష్టపడి అందర్నీ వదులుకుని వచ్చిన మాలక్షుమ్మనీ, ఆమె వచ్చేక మారిన తన తత్వాన్నీ, పనుల్నీ, గెనుల్లో పడిన తొలిరోజుల కష్టాల్ని అన్నిట్నీ గుర్తు చేసుకున్నాడు మాలకొండయ్య. అన్నీ వింటూనే ఆలోచిస్తున్నాడు నారాయణ.

ఇలా ఉండే ఊరు ఎలా అయింది? ఊర్ని, ఊరి జనాన్ని అమితంగా ప్రేమించిన తండ్రి ఇట్లా ఎందు కయ్యాడు? ఊర్ని విడిచిపెట్టి పని వెదుక్కుంటూ వెళ్లిన బావను ఏ కొండచిలువ మింగేసింది? ఆఖరుకు ఆ యంత్రరాక్షసి తనను మాత్రం మింగెయ్యకుండా వుంటుందా? నారాయణలో ఏవేవో పలవరింతలు. లోపల్లోపల మరుగుతున్నాడు.

''ఎందుకు నాయనా అంత దిగులు. మందులిస్తే మింగవు. ఏం పెట్టినా కడుపుకు తినవు. అమ్మ లేదని దిగులా!'' నారాయణ కడుపులోని ప్రశ్నను తండ్రి ముందుంచేడు.

మాలకొండయ్య నుంచి జవాబు రాలేదు. కొడుకు మాటలు విననట్లే ఉన్నాడు. మళ్లీ హఠాత్తుగా నారాయణే అడిగాడు. ''నాయనా! ఊరంతా ఎందు కిట్లయింది? ఊర్ని చూస్తుంటే నీకేం దిగులెయ్యటం లేదా!''

మాలకొండయ్య సాలోచనగా నారాయణ ముఖంలోకి చూచేడు.

''ఏభై ఏళ్లు! యాభై ఏళ్ల మా తరమంతా కష్టం చేసి త్యాగాలు చేసి ఈ గెనుల్నీ ఊర్నీ నిర్మించుకున్నా మయ్యా! ఇంతలోకే మా కళ్ల ముందే సతికిలబడిపో యిందిగా నాయనా. ఈ గెనుల్లో చేరినకాడి నుంచి మేమంతా ఒకరికోసం ఒకరమన్నట్లు బతికేం. కావల్సిన వాటికోసం ఓనర్లని బతిమిలాడుకున్నాం. వినకపోతే పెడద్రంగా మాట్లాడేం. అట్లాగూడా కాకపోతే అందరం తెగబడి ఎదురునిల్చి పన్లో కెళ్లకుండా నిలబడేవాళ్లం. అట్ట వచ్చినయ్యే నాయనా ఇయ్యన్నీ. నెత్తి మీద ఇనప టోపీల కాడ్నుంచి గెనిలోపల లైట్లూ, మూలమూలలకీ ఫోన్లదాకా, కాన్పులకి ఆసుపత్రులూ, టీబీ వస్తే ఆసుపత్రులు, పిల్లల చదువులకి బడులూ- ఇయ్యన్నీ ఊరికే రాలేదు నాయనా. త్యాగాలు, త్యాగాలు చేసి చెమట ధారపోస్తే వచ్చినాయిరా. అట్టాంటిది ఒక తరానికే ఇయ్యన్నీ మాయమవుతున్నాయనేదే నా బాధంతా. ఇంకేం చూచుకుని బతకాలి నాయనా మేం. మీతరం కోసం మేమేం మిగిల్చేమని.''

గుక్కు తిప్పుకోకుండా మాట్లాడి, గ్లాసులోని ద్రవం గుటగుట తాగేడు మాలకొండయ్య.

''మాకోసం ఎందుకు నాయనా అంత దిగులు. మీరు మాత్రమేం చేస్తారు. మీ చేతుల్లో ఏముందని చెప్పు. అయినా మేమేం బతకలేకపోతున్నామా? మైకా మైన్లు గాకపోతే గ్రానైట్ గనులు! బతకడానికి మార్గాలే లేవా? అట్ట దిగులుపడితే బతగ్గలమా?'' నారాయణ అన్నాడు.

''మిమ్మల్ని దిగులుపడమని కాదు నాయనా. మేం కట్టించేది మా పిల్లలకు దక్కకుండా మా ముందే కూలిపోతన్నాయన్న బాధయ్యా. గజదొంగగా తాడూ బొంగరం లేకుండా ఊరూవాడా లేకుండా దేశదిమ్మరినై తిరుగుతుంటే మీయమ్మ తటస్థపడి నన్నో మనిషిగా నిలబెట్టింది. గెనిలో చేరినాక ఇద్దరం కాయకష్టం చేసు కుని బతికేంగాని మళ్లెప్పుడు నాకోసమని దొంగతనం జోలికి పోలేదు. ఒక్కోమాలి మైనులో సరుకు బయటకు చేరేసినా తప్పో ఒప్పో నలుగురి కోసం చేసేను తప్పితే నాకోసం చెయ్యలేదయ్యా. మీరంతా రెక్కలొచ్చిన పక్షు ల్లాగా మా ముందే తలోదిక్కుకు ఎగిరిపోయి మాంసం

ముద్దలై తిరిగొస్తుంటే ఎట్టుంటదో చెప్పు. ఎంత మందని? ఒకటా రెండా! కనీసం పదిమందైనా అట్టనే వచ్చినారు గదా! మీ బావేమయ్యేడు? ఒకేళ మీరంతా కలిసి ఈడ మేం జేసినట్టు కొన్నాళ్లకి ఏమన్నా సాధించుకున్నా అయ్యి మీ పిల్లలకు మిగుల్తుందన్న ఆశ లేదుగా!'' చాలారోజుల తర్వాత మాలకొండయ్య దృఢంగా మాట్లాడుతున్నాడు. అంతసేపు మాట్లాడినా అతడి గొంతులో దగ్గుతెర కనిపించలేదు. దుఃఖపు జీర కదలాడుతోంది.

''నారాయణా! ఏడ ఏం జరుగుతుందో నాకర్థం కావడంలేదురా! పియ్యేఫ్‌లు లేకపోయినా, పెన్షన్లు ఇయ్యకపోయినా ఉన్న వసతులు తీసేసినా బతుకు తెరువు కోసం కూలోళ్లు వస్తానే ఉంటిరి. మైకా గనులు నడుస్తానే ఉండె. తెల్లారి పన్లో కెళ్లడంకోసం ఎంతమంది జనం సద్దులు గట్టుకుని లాస్టు బస్సులకొచ్చి రోడ్డు పక్కన పక్కలు పరుచుకుని పడుకుంటున్నారో చూసావా? మరి దీన్ని ఆకలిబాధ అనుకోవాలా? అన్నిటికీ సర్దుకుపోవడం అనుకోవాలా? దీన్నెట్టా అర్థం చేసుకోవాల్రా?''

మాలకొండయ్య గొంతు ఆవేశంగా మొదలై క్రమేణా నీరసించి మళ్లీ ఒక దగ్గుతెర కమ్మింది. నారాయణ తండ్రికి మరింత సన్నిహితంగా జరిగి అతని గొంతు కింద మృదువుగా నిమిరేడు.

నారాయణ మది నిండా ప్రశ్నలే. అతనిలో అల్లిబిల్లి ఆలోచనలన్నీ ముసురుకుంటున్నాయి. మనిషి అతలాకుతలం అవుతున్నాడు. తాగుతున్న ద్రవం మరిన్ని ప్రశ్నల్ని రేకెత్తిస్తోంది. అతడికి తల్లి గుర్తొచ్చింది.

తల్లి మాలక్షుమ్మ ఎప్పుడూ తండ్రి వెన్నంటే వుండేది. ఆయన గెనిలో దిగితే ఆమె ఫ్యాక్టరీలో కూలి కెళ్లేది. ఆమెకు తండ్రి మాటే వేదం. అటువంటిది ఏళ్ల తరబడి వచ్చే కడుపునొప్పి భరించలేక ఎన్ని మందులు తిన్నా తగ్గక ఏడాది క్రితం ఒక నడిరాత్రి దూలానికి ఉరేసుకుంది. తల్లి అట్లా అర్థాంతరంగా కడతేరిపోయింది.

అతడికి చిన్నప్పటి సంఘటనలెన్నో గుర్తొచ్చేయి. తండ్రి కోసం ఆమె చూపిన తెగువ గుర్తొచ్చింది. ఆమెతో పాటు మిగిలిన ఆడవాళ్ల చర్య గుర్తొచ్చింది. నలుగురు మనుషుల కోసం ఊళ్లన్నీ కదిలిన జ్ఞాపకం అతన్ని ముంచెత్తింది. వర్తమానం, భవిష్యత్తూ అన్నీ కలగలిసి పోతున్నాయి.

అతడిలోంచి ఒక దుఃఖం పెల్లుబిన పగిలింది. మెల్లిగా చిన్నపిల్లవాడి రోదనలా మొదలైంది దుఃఖం. అది పెరిగి పెరిగి ఏడుపుగా మారి తండ్రి ఒడిని తడిపేసింది.

''ఛ! ఊరుకోరా నాయనా! పిల్లల్లేస్తే వాళ్లూ అల్లాడతారు. వాళ్లనన్నా ప్రశాంతంగా పడుకోనీ రా!'' అని కొడుకు తలలోకి చేతులు పోనిచ్చి ప్రేమగా నిమురుతున్నాడు తండ్రి. ఆయన కళ్లలోనూ నీటి ఊట మెరుస్తోంది.

అప్పుడే బండిని నెట్టుకుంటూ చిరుచీకట్లో నుంచి వాకిలి ముందుకు వచ్చింది భూదేవమ్మ. బండికి వేళ్లాడుతూ లాంతరు...

కొద్దిపాటి వెలుతుర్ని చిమ్ముతోంది.

''సాల్లే! సంబడం. అబ్బాకొడుకులిద్దరూ పనేం లేక తీరిగ్గా ఏడుస్తూ కూర్చున్నారా? ఎవురన్నా చూస్తే నవ్విపోతారు,'' అందామె. ఆమె గొంతులోనూ ఒక దుఃఖపు జీర.

ఆకాశంలో ముసురుకున్న చుక్కలు తెగ వెలుగుతున్నాయి. చంద్రుడు అర్ధచంద్రాకారంలో సన్నటి వెలుగును విరజిమ్ముతున్నాడు. భూమ్మీద కరంటు బల్బులు ఆ వెల్తుర్తో కూడా పోటీపడలేక పోతున్నాయి. భూమిలో కలవని మైకా ముక్కలపొడి ఆ కాస్త వెల్తురుకే ధగధగా మెరుస్తోంది.

ఆ రాత్రంతా నారాయణ కలవరిస్తూనే ఉన్నాడు. చిన్నపిల్లాడిలా తెరలుతెరలుగా ఏడుస్తూనే ఉన్నాడు.

గూడూరునీ పొదలకూరునీ కలుపుతూ రోడ్డూ-

రోడ్డు పక్కన ఆకాశమంతెత్తున గుట్టలు గుట్టలుగా తవ్విపోసిన మట్టీ, మైకా గనులూ-

శిథిలమవుతున్న ఆసుపత్రులూ, హైస్కూలూ-

ఏపుగా పెరుగుతోన్న కర్రతుమ్మ చెట్ల వనాలు-

నరసంచారానికి మెల్లిమెల్లిగా దూరమవుతూ ఒక విధ్వంసాన్ని అనుభవిస్తోన్న ఊరు-

నారాయణ ఏడుస్తున్నట్టుగా లేదు.

ఒక సామూహిక దుఃఖాన్ని ఆవాహన చేసుకున్న ఆ ఊరు ఊరే పసిపిల్లలా ఏడుస్తున్నట్లుంది.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 15 ఆగస్టు 2003*

